క్లుప్తంగా

అభిమాని కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న అల్లు అర్జున్ అభిమానులు

రణస్థలం: సినీ నటుడు అల్లు అర్జున్ అభిమాని అనిల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రణస్థలం అల్లు అర్జున్ అభిమానులు రూ.10వేలు, వైజాగ్ ఏఏటీం ఫ్యాన్స్ రూ.12వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ రెడ్డి, అర్జున్, విజయ్, మైలపల్లి బన్నీ, లక్కీ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం



ఎర్రయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: మండలంలోని మధుపాం గ్రామానికి చెందిన ఇమందు ఎర్రయ్య వెలగాడ సచివాలయంలో విద్యుత్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల 27న వెలగాడలో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005 బ్యాచ్ విద్యార్థులు, ఉషోదయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం రూ.42వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కాలువ మరమ్మతుల పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడి కాలువ మరమ్మతు పనులను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆదివారం పరిశీలించారు. రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో కాలువలో పూడికల తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహారం వరకు పనులు జరుగుతున్నాయి. ఖరీఫ్‌లో సజావుగా సాగునీరు అందించటం లక్ష్యమని ఎంపీపీ తెలిపారు. ఆయన వెంట నాయకులు బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్, అల్లు సూర్యనారాయణ, సత్తారు గోపి ఉన్నారు.

అందుబాటులో ఎరువులు



లావేరు రైతు భరోసా కేంద్రంలో ఎరువుల బస్తాలు

లావేరు: లావేరు-1 రైతు భరోసా కేంద్రంలో యూరియా, డీఏపీ ఎరువు సిద్ధంగా ఉందని వీహెచ్ఏ పి.గిరిజ తెలిపారు. మొక్కజొన్న, పత్తి, వరి, చెరకు పంటలు సాగు చేస్తున్న రైతులను దృష్టిలో పెట్టుకొని ఎరువులను తెప్పించినట్లు తెలిపారు. కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకొని రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కుశాలపురంలో దుర్గాదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కుక్కల స్వైర విహారం



లావేటిపాలెం రోడ్డులో కుక్కల గుంపు

లావేరు: మండలంలోని లావేరు, లావేటిపాలేం, కేశవరాయునిపురం గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ వెంబడిస్తుండటంతో వాహనచోదకులకు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేదల సేవలో..!

- ఉచితంగా క్లినికల్ లేబొరేటరీ పరీక్షలు
- సత్యసాయి సేవా సంస్థ ఔదార్యం
- శ్రీకాకుళం పెద్దమందిరంలో నిర్వహణ
- అందుబాటులో వైద్యులు



ఆధునిక క్లినికల్ ల్యాబ్ పరికరాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్దమందిరంలో ఉచితంగా క్లినికల్ లేబొరేటరీ టెస్టులు నిర్వహిస్తున్నారు. పేదలే పరమావధిగా వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో టెస్టుల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళంలోని సత్యసాయి పెద్దమందిరంలో 2021లో క్లినికల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు.

ఎక్కడ..ఎప్పుడంటే..

శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరం పక్కనే ఉన్న సత్యసాయి పెద్ద మందిరంలో ఉచితంగా టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచితంగా ల్యాబొరేటరీ టెస్టు నిర్వహిస్తారు. గురువారం సెలవు దినం.

అన్ని రకాల టెస్టులు ఉచితమే..

సీబీసీ (కంప్లీట్ బ్లడ్ కౌంట్), కేఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్, యూరిన్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఇందులో హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, మలేరియా, ఫైలేరియా, టీబీ, జాండీస్, హెచ్ఐవీ ఎయిడ్స్, డెంగీ, బ్లడ్ గ్రూప్, ఎముకల టెస్టు(ఆర్థరైటిస్), కిడ్నీ టెస్టు, లివర్ టెస్టు, యూరిన్ టెస్టు, కొలెస్ట్రాల్ టెస్టులు ఉచితంగా చేయించుకోవచ్చు.

అధునాతన పరికరాలు..

కచ్చితమైన రిపోర్టులు వచ్చేలా లక్షలాది రూపాయల వ్యయంతో ఆధునిక టెక్నాలజీ కలిగిన పరికరాలను ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు. సీబీసీ మిషన్, బయో కెమిస్ట్రీ ఎనాలసిస్ మిషన్, బ్లడ్ మిక్సర్, మైక్రోస్కోప్, సెన్‌ట్రిఫ్యూస్, యూరిన్ ఎగ్జామినర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

వైద్యసేవలు సైతం..

ల్యాబ్ టెస్టులతో పాటు 20 ఏళ్లగా ఉచితంగా వైద్య సేవలు సైతం అందిస్తున్నారు. ప్రతి రోజూ వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు సైతం అందిస్తున్నారు. ప్రతి ఆదివారం డాక్టర్ సంపత్‌కుమార్, సోమవారం ఎ.లక్ష్మీదీప్, మంగళవారం ఎస్.గిరిబాబు, బుధవారం ఎం.చిట్టిబాబు(చర్మవ్యాధి), శుక్రవారం ఆర్.అరవింద్(గైనిక్), శనివారం ఎల్.సోమశేఖర్‌లు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మందుల కోసం నెలకు రూ.50వేలు ఖర్చు చేస్తున్నారు. అందులో రూ.20 వేలు సమితి వారికి. మిగిలినవి ఉచితంగా సేకరించినవి. ఇక్కడ ఇద్దరు ఫార్మాసిస్టులు ఉచితంగా సేవలు అందిస్తున్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సాయిసేవ చేస్తున్నాం..



పేద ప్రజలకు తాము చేస్తున్న వైద్య సేవను సాయి సేవగా భావిస్తున్నాం. ప్రతిరోజు ఒక వైద్యుడు ఉచిత సేవలు అందిస్తున్నారు. ల్యాబ్ టెస్టులు ఉచితంగా చేసి రిపోర్టులు కూడా ఇస్తాం. బయట చాలా ఖరీదైన టెస్టులను ఇక్కడ ఉచితంగానే అందిస్తున్నాం.

– డాక్టర్ సంపత్‌కుమార్, వైద్యుడు

శివారు భూములకూ సాగునీరు అందాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మడ్డువలస అధికారులను ఆదేశించారు. వాంగ్రంగి పరిధిలో పంట పొలాలకు వెళ్లే కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల్లో కల్వర్టు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, మడ్డువలస సాగునీరు ఇంతవరకు తమ గ్రామాలకు రాకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని వాంగ్రంగి, ఆనందపురం, మధుపాం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మధుపాం నుంచి పొందూరు మండలం బొట్లపేట నుంచి వాంగ్రంగి గ్రామానికి కాలువలు తవ్వినా కల్వర్టులు నిర్మించలేదని, దీంతో వాంగ్రంగిలో సుమారు 800 ఎకరాలు బీడు భూములుగా మారాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతాల్లో రెండు కల్వర్టులు నిర్మిస్తే పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వాంగ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, మడ్డువలస ప్రాజెక్టు డీఈఈ పి.నాగేశ్వరరావు, ఏఈఈలు కోటి, అనిల్, నాయకులు నల్లి తవిటినాయుడు , చిత్తిరి మోహన్, ఇ.గోవిందరావు, తొత్తడి రామారావు పాల్గొన్నారు.

మంత్రి బొత్సకు జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి బొత్సకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినం సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం విజయనగరం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం కూడా శుభాకాంక్షలు తెలిపారు.

లావేరు: మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, ఏపీ అర్బన్ ఫైనాన్సు కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, మాజీ సర్పంచ్‌లు వట్టి సత్యనారాయణ, శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, మురపాక ఎంపీటీసీ తేనేల సురేష్ కుమార్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కో–కన్వీనర్ మీసాల జగన్, నాయకులు పెరుమాళ్ల రమణ, పతివాడ గురునాయుడు, చందక నాగరాజు, వాసు, రమేష్‌నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మురళీమోహన్

శ్రీకాకుళం అర్బన్: రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌ను సమాజ సేవ ద్వారా మరింత ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలని 3020 మాజీ జిల్లా గవర్నర్ ఎం.రామారావు అన్నారు. 3020 రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన అధ్యక్షునిగా యెరుకోల మురళీ మోహన్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ చేపట్టిన మంచి సేవా కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అనుభవం, యువత మేళవింపుతో సమష్టిగా పని చేయాలన్నారు. జిల్లాలో ఎక్కువ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. క్లబ్ సేవల్లో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడు యెరుకోల మురళీమోహన్ మాట్లాడుతూ 2023–24 ఏడాదికి గాను చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. క్లబ్ అధ్యక్షునిగా శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, అందరి సహాయ సహకారాలతో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, విద్య, వైద్యం కోసం కృషిచేస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శివశంకర్, వెంకుబాబు, దుర్గారావు, కొంచాడ సోమేశ్వరరావు, నటుకుల మోహన్, ఎంఆర్‌కే దాస్, తమ్మినేని వాసుదేవరావు, పాత్రుని పాపారావు, ఎ.శంకరరావు, వరదా కొండబాబు, అన్నెపు సత్యన్నారాయణ, కింతలి నాగేశ్వరరావు, మామిడి క్రాంతి, మెట్ట అనంత భట్లు, ఊన్న సంతోష్‌కుమార్, అంధవరపు రఘుబాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా ఫ్లైఓవర్ పనులు



నీలమణిదుర్గ ఆలయం ముందు ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం కూడలిలో హైవే ఫ్లైఓవర్, అండర్ పాసేజ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టెక్కలి రోడ్డు నుంచి వచ్చే వాహనాలు రాకపోకలకు ఫ్లైఓవర్ కింద పాస్‌జేను ఏర్పాటు చేస్తున్నామని హైవే అధికారులు తెలిపారు. పాతపట్నం నుంచి నేరుగా టెక్కలి, కొరసవాడ నుంచి టెక్కలి వైపు వెళ్లడానికి అండర్ పాసేజ్ ఉపయోగపడుతుందన్నారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ పనులు చేస్తున్నామని, అందులో భాగంగా పెంట్రోల్ బంక్ వద్ద పనులు ప్రారంభించామని తెలిపారు.

చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేఖర్

పాతపట్నం: చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. స్థానిక అమ్మవారి ఆలయం సమీపంలోని సప్తగిరి కల్యాణ మండపంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 20వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బొయిన అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు జరుగుతాయన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు చాపర సుందర్‌లాల్ మాట్లాడుతూ మహాసభల్లో తీర్మానాలను, నూతన కౌన్సిల్, కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి ఎల్.వెంకటరావు, చాపర వెంకటరమణ, వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా శిథిల పాఠశాల భవనాలు



కేశవరాయునిపురంలో పాత భవనాలు

లావేరు: మండలంలోని కేశవరాయునిపురంలో ప్రభుత్వ పాఠశాలల వద్ద శిథిల భవనాలు ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం నూతన భవనాల్లో తరగతులు జరుగుతున్నా విద్యార్థులు ఖాళీ సమయాల్లో శిథిల భవనాల వద్ద ఆడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిల భవనాలను కూల్చివేయాలని వారు కోరుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

గార: మండలంలోని మెండపేట సమీపంలోని తోటల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్.కామేశ్వరరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

షట్టర్ల ఏర్పాటు



షట్టర్ల పనులు పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ

సరుబుజ్జిలి: రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. ఏళ్ల తరబడి యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌కు పురుషోత్తపురం వద్ద పడుతున్న ఇబ్బందులు రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుచేయించారు. ఈ మేరకు ఆదివారం షట్టర్లు పనులు ప్రారంభించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేసారు. ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లి రామ్మోహనరావు, ఓపెన్‌హెడ్ చానల్ ఇంజినీర్లు, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



దేవరాపల్లిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

రణస్థలం: మండలంలోని దేవరాపల్లిలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు పనులు పర్యవేక్షించారు. వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రానికి ట్రాక్టర్‌తో తరలించారు.



సంతవురిటిలో కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

జి.సిగడాం: సంతవురిటిలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ బుడారి లక్ష్మణరావు పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శి హిమబిందు, ఏఎన్ఎం కుప్పిలి లక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గురువు దైవంతో సమానం



మాట్లాడుతున్న విజయనగరం విభాగ్ ప్రచారక్ రాజశేఖర్

కొత్తూరు: మన సంస్కృతిలో గురువు దైవంతో సమానమని ఆర్ఎస్ఎస్ విజయనగరం విభాగ్ ప్రచారక్ రాజశేఖర్ అన్నారు. కొత్తూరులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌తోపాటు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఖండ ప్రచారక్ రాము, పోలినాయుడు మాట్లాడుతూ.. మన సనాతన ధర్మంలో గురువుకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు. దేశ వైభవానికి ప్రతీ పౌరుడు కృషిచేయాలని కోరారు. 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్‌లో స్వయం సేవక్‌లు చేరి దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో మహానుభావులు ఉన్నారని గుర్తుచేశారు. కొత్తూరు, సీతంపేట, భామిని మండలాలకు చెందిన స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు



నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

ఆమదాలవలస: మండలంలోని విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లోలుగు విశ్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సన్నిధిలో మండల విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పాటు చేసేందుకు ఆదివారం సమావేశం నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్లుగా కటకం పూర్ణచంద్రరావు, నల్లబాటి రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా దుప్పలపూడి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా మండ వెంకటరమణమూర్తి, ట్రెజరర్‌గా కటకం హరిప్రసాద్, అసిస్టెంట్ ట్రెజరర్‌గా టేకి గోపాలకృష్ణ, కన్వీనర్‌గా తాలాబత్తుల ధనుంజయరావు, సహాయ కన్వీనర్‌గా నిమ్మగడ్డ రామనాగ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుప్పిలి చంద్రమౌళి, మండా రాజేశ్వరరావు, ఒమ్మి భాస్కరరావు, ప్రత్యేక సలహాదారుడిగా కటకం నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

శ్రేయా మిశ్రోకు జూరీ అవార్డు



శ్రేయా మిశ్రోకు అవార్డు, మెమొంటో అందజేస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ రాజు

పాతపట్నం: విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఏయూ సంగీత నృత్య విభాగం, నాట్య రవళి మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అఖిల భారత సంగీత నృత్య ప్రదర్శన నిర్వహించారు. పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో జూరీ అవార్డు దక్కింది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం, ఒడిస్సీ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీలకు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడిలో శ్రేయామిశ్రో చేసిన నృత్య ప్రదర్శనకు (ప్లేట్ డాన్స్) అవార్డు దక్కింది. సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి బి.ఎస్.ఎన్.రాజు, ఆంధ్రా యూనివర్సిటీ సంగీత నృత్య విభాగం అధిపతి ప్రొఫెసర్ అనూరాధ, ప్రొఫెసర్స్ సులేమన్, మహమ్మద్ ఖాన్, నాట్య రవళి వ్యవస్థాపకుడు మహేష్ బాబు, నటరాజ్ పరమేశ్వరన్, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం వివరించి..సమస్యలు పరిష్కరించి..!

- జి.సిగడాం మండలంలో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం
- 21 సచివాలయాల్లో 19 వేల గడపల్లో అడుగుపెట్టిన ఎమ్మెల్యే కిరణ్



ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు

జి.సిగడాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జి.సిగడాం మండలంలో ముగిసింది. గత ఏడాది మే 19న ఆనందపురం గ్రామ సచివాలయం వద్ద ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రతి గ్రామానికి వెళ్లి లబ్ధిదారులను కలిశారు. నాలుగేళ్ల పాలనలో కలిగిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం జి.సిగడాం మండలంలో 21 సచివాలయాల పరిధిలో 19వేల గడపలకు వెళ్లి లబ్ధిదారుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. గెడ్డకంచరాంలో చివరి రోజు కార్యక్రమం నిర్వహించారు.

దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం..

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం చేసేవిధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారు. దీర్ఘకాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. కాలువలు, తాగునీటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగాఉంది..



గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా జి.సిగడాం మండలంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాం. స్థానిక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాం. ప్రజలతో మమేకం కావడం ఆనందంగా ఉంది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల నియోజకవర్గం